కాంగ్రెస్ అంటేనే...420

- అటకెక్కిన ఆరు గ్యారెంటీలు
- ఇంకా డబ్బులు పడకపాయే..వ్యవసాయానికి తిప్పలు
- పూటకోమాట..రోజుకో తీరు
- దొంగ హామీలను నిరసిస్తూ

గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేసిన ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ పట్టణంలో మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, తదితరులు

శంషాబాద్ రూరల్/మణికొండ, జనవరి 30 : ఎన్నికలలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా గురువారం శంషాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు ఆధ్వర్యంలో శంషాబాద్ పట్టణంలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముఖ్యఅతిథిగా కార్తీక్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన 420 హామీలలో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారంలో ఉండే హక్కులేదన్నారు. అధికారంలోకి రావడం కోసం అనేక హామీలను ఇచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోయి రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద ఏడాదికి రూ.15వేలు, వరి పంటకు బోనస్ ఇలా అనేక హామీలు ఇచ్చి వాటిలో ఏది పూర్తిగా అమలు చేయలేదన్నారు. దీంతో పాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో భాగంగా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు కనీసం లక్ష రూపాయలు కూడా ఇవ్వలేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరక్టర్ సతీష్, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా,రాష్ట్ర నాయకుడు మంచర్ల శ్రీనివాస్, దీపమ్ లేష్,లీగల్‌సెల్ అధ్యక్షుడు కొన్నమొల్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి,రాము నాయక్, చిన్నగండు రాజేందర్, రమేష్, గుంటిచరణ్,వెంకట్‌రెడ్డి, గూడేపు అశోక్,సురేష్ ముదిరాజ్, కొమ్మగోపాల్, రాఘవేందర్, శివ శంకర్, మురళి,మహేష్‌యాదవ్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పుప్పాలగూడలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ మహాత్మాగాంధీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గుట్టమీది నరేందర్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కుంబగళ్ల ధనరాజ్, రూపారెడ్డి, ముత్తంగి లక్ష్మయ్య, అందె లక్ష్మణ్‌రావు, గోరుకంటి విఠల్, ఏర్పుల శ్రీకాంత్, గుట్టమీది రాఘవేందర్, సంగం శ్రీకాంత్, ప్రకాష్, బండమీది మల్లేష్, మల్యాద్రినాయుడు, శ్రీబాబు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీశైలం, యాలాల కిరణ్, సుమన్, దిలీప్, ప్రవీణ్, ఆరిఫ్ మహమ్మద్, శ్రీధర్, కృష్ణరాజీ, సుమనళిని, మధుచందన, తరుణ్, మహేష్, రవిసాగర్, మహేందర్, రాజు, రమేష్, షేక్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి బుద్ధి,జ్ఞానం ప్రసాదించాలి

బండ్లగూడ: ఓ మహాత్మా.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ ట్రస్ట్ ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.కార్పొరేషన్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి,ప్రధాన కార్యదర్శి రాముడు యాదవ్ తదితర నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పుప్పాలగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన గాంధీ చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కస్తూర్బాగాంధీ ట్రస్ట్ ఆవరణలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బండ్లగూడ జాగీర్ బీఆర్ఎస్ నాయకులు

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

సహకార సంఘం చైర్మన్ బుర్కుంట సతీష్

మల్కారం సహకార సంఘంలో రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్ సతీష్, తదితరులు

శంషాబాద్ రూరల్, జనవరి 30 : రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మల్కారం సహకార సంఘం చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరక్టర్ బుర్కుంట సతీష్ సూచించారు. గురువారం మండలంలోని మలక్రాం సహకార సంఘం పరిధిలోని ఇద్దరు రైతులకు రూ. 9 లక్షల రుణాల చెక్కులను పంపిణీ చేశారు.దీంతో పాటు గతంలో ఆవులు మృతి చెందగా వారికి ఇన్స్‌రెన్స్ డబ్బులను ఇప్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకొని వ్యవసాయం పనుల్లో ముందుకు సాగాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్,జనవరి 30: విద్యుత్ కేబుళ్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు తదితర పనుల కారణంగా శుక్రవారం బంజారాహిల్స్ టీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ గోపి ఒక ప్రకటనలో తెలిపారు.

- కృష్ణానగర్ సబ్ స్టేషన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10, జైపాల్ రెడ్డి నివాసం, రోడ్డు నంబర్ 15 ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట దాకా కరెంట్ సరఫరా ఉండదు.
- కల్యాణ్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఏజీ కాలనీ, సిద్ధార్థ నగర్, వికాస్‌పురి కాలనీ, ఈఎస్ఐ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కరెంట్ సరఫరా ఉండదు.
- జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 22 సబ్ స్టేషన్ పరిధిలోని రోడ్డు నంబర్ 27నుంచి 32 వరకు, ఎంసీహెచ్‌ఆర్డీ, ఇషా లైఫ్ లేన్‌లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల దాకా కరెంట్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

నేటితో ముగియనున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న డీసీ జాకియా సుల్తానా

జూబ్లీహిల్స్,జనవరి 30: యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముమ్మరం చేశారు. నేటితో సర్వే ముగియనుండగా జీహెచ్ఎంసీ అధికారులు ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను గురువారం జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజాపాలనలో 39 వేలమంది ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 36,480 కు పైగా దరఖాస్తుల సర్వే పూర్తిచేసినట్లు తెలిపారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తికావచ్చిందని ఆమె తెలిపారు. మరోవైపు ఇప్పటికే సర్వే చేసిన 5 శాతం దరఖాస్తులను అధికారులు సూపర్ చెక్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ సాల్మన్, శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

అంగడి శేషప్పకు పీహెచ్‌డీ ప్రదానం

పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న శేషప్ప

శంషాబాద్ రూరల్, జనవరి 30 : శంషాబాద్ మండలంలోని ఓ రైతు కుటుంబానికి చెందిన అంగడి శేషప్ప మెకానికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టాను పొందారు. నగరంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న శేషప్ప జేఎన్‌టీయూ ఆచార్యుడు డాక్టర్ బి ఆంజనేయ ప్రసాద్ పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్ ఆఫ్ మెకానికల్ క్యారెక్టరిస్టిక్ ఆఫ్ ఏఎల్ 7075 మెటల్ మాట్రిక్స్ కంపోజిట్స్ ఏఎల్203,ఎస్ఐసీ నానోఫిల్టర్స్ అనే అంశంపై పరిశోధన పత్రాలను సమర్పించడంతో హైదరాబాద్‌జేఎన్‌టీయూ నుంచి పీహెచ్‌డీ పట్టాను గురువారం అందుకున్నట్లు శేషప్ప తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ: కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని, రాజేంద్రనగర్‌లో గల ఉద్యాన కళాశాలలో గురువారం విద్యార్థి సంఘాల క్యాలెండర్‌ను వీసీ రాజిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాలం విలువ తెలుసుకోవాలన్నారు. - వ్యవసాయ యూనివర్సిటీ

మురుగు సమస్యకు తాత్కాలిక పరిష్కారం

బసవతారకం నగర్ బస్తీలో సమస్యను తెలుసుకుంటున్న జలమండలి జీఎం హరిశంకర్, తదితరులు

బంజారాహిల్స్,జనవరి 30: ఫిలింనగర్‌లోని బసవతారకం నగర్ బస్తీలో మురుగు సమస్యలపై 'నమస్తే తెలంగాణ'లో గురువారం ' పేదలు ఉంటున్న బస్తీలపై అధికారుల చిన్నచూపు' పేరుతో ప్రచురించిన కథనంతో జలమండలి అధికారులు స్పందించారు. జలమండలి డివిజన్-6 జనరల్ మేనేజర్ హరిశంకర్, డీజీఎం షీలా రాణి, స్థానిక ఇన్‌చార్జి మేనేజర్ రాంబాబు తదితరులు బస్తీలో పర్యటించి సమస్యకు గల కారణాలపై ఆరా తీశారు. బస్తీలో జీహెచ్ఎంసీకి చెందిన వరదనీటి నాలా లైన్ మాత్రమే ఉందని, ప్రత్యేకంగా సీవరేజ్ లైన్ లేకపోవడంతో డ్రైనేజీ కలెక్షన్లు మొత్తం నాలాలోకి కలిపివేసినట్లు గుర్తించారు. జీహెచ్ఎంసీ నాలాలో పూడికతో పాటు చెత్తాచెదారం నిండిపోవడంతో మురుగునీరు ముందుకు వెళ్లలేక రోడ్లపై ప్రవహిస్తున్నట్లు తేలింది. దీంతో అప్పటికప్పుడే ఎయిర్ టెక్ యంత్రాన్ని పిలిపించి నాలాను శుభ్రం చేయించారు. కాగా ఇక్కడ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గల అవకాశాలపై సర్వే నిర్వహించాలని జీఎం హరిశంకర్ ఆదేశించారు.

వాసవీ దేవాలయ ధర్మకర్తగా మల్లికార్జున్

ఖైరతాబాద్, జనవరి 30 : యాకుత్‌పురా బ్రాహ్మణవాడిలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం ధర్మకర్తగా వాసవీ సేవా కేంద్రం జీవితకాలపు సభ్యులు కొండ్లె మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మల్లికార్జున్ ఏడాది కాలం పదవీలో కొనసాగనున్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీటీసీఏ, బీహెచ్ఎంసీటీ కోర్సుల ఆరో సెమిస్టర్ మేకప్, పీజీ డిప్లామా ఇన్ యోగా, దూరవిద్య ఎంసీఏ మొదటి, మూడో సెమిస్టర్, పీజీడీసీఏ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలతో పాటు డేటా సైన్స్ కోర్సు పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

బ్యాచిలర్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనింగ్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సు పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షలను వచ్చే నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డుపై వరదలా..మురుగు

ఏడాది కాలంగా పైపులైను పనులు పెండింగ్

పట్టించుకోని ఎమ్మెల్యే, కార్పొరేటర్

తమకేమి పట్టనట్లుగా అధికారులు

ఖైరతాబాద్, జనవరి 30 : ఏడాది కాలంగా ఆ రోడ్డుపై మురుగు వరదలా పారుతోంది. ఒకటి కాదు....రెండు కాదు....24 గంటల పాటు నీరు ప్రవహిస్తుండడంతో స్థానికులు ముక్కులు మూసుకొని కాలం వెల్లదీస్తున్నారు. అధికారులకు చెబితే పట్టించుకోరు.... ప్రజాప్రతినిధులైతే ఇటువైపు కన్నెత్తి చూడరు. ఫలితంగా స్థానిక బస్తీ ప్రజల ఇక్కట్లు వర్ణణాతీతం. సోమాజిగూడ డివిజన్‌లోని బీఎస్‌మక్తా హరిగేట్‌లో ఈ దుస్థితి నెలకొంది. లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఇక్కడ సీవరేజీ పైపులైను పనులు ప్రారంభించాల్సి ఉండగా, సంవత్సరం దాటినా పనులు ప్రారంభించకపోవడంతో ఇబ్బందులు పడడం ప్రజల వంతైంది.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

బీఎస్ మక్తాలో గత ఏడాది గ్రీన్ మినీ మార్ట్ నుంచి ఖమ్రుద్దీన్ ఇంటి వరకు 300 ఎంఎం డయా, అక్కడి నుంచి మహాలక్ష్మి దేవాలయం వరకు 250 ఎంఎం డయా పైపులైను పనులకు ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వనం సంగీత యాదవ్‌లు శంకుస్థాపనలు చేశారు. నాటి నుంచి నేటి వరకు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా స్థానికంగా ఉన్న బస్తీ వాసులకు, ముఖ్యంగా ఇక్కడ హుస్సేన్ మసీదు కూడా ఉండడంతో నిత్యం ప్రార్థనలు చేసుకునేందుకు వెళ్లే వృద్ధులు, యువకులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు వృద్ధి చెంది అస్పత్రుల పాలవుతున్నారు. ఇప్పటికైనా పైపులైను పనులు ప్రారంభించి తమ సమస్యలు తీర్చాలని స్థానిక బస్తీ ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలాన్ని తలపిస్తూ జలమయమైన హరిగేట్ హుస్సేన్ మసీదు రోడ్డు

సీవరేజీ పైపులైను కోసం వేసిన శిలాఫలకం (ఫైల్)

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి కమిషనర్ శరత్‌చంద్ర అధికారులు,సిబ్బందితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డీఈఈ యాదయ్య,మంజులత ఇతర సిబ్బంది పాల్గొన్నారు. - బండ్లగూడ,జనవరి 30

దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ ఎనలేని పోరాటాలు చేశారని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొలన్ సుభాష్‌రెడ్డి, చిట్టిగారి చిన్న, సోమారం రవీందర్, ఎన్.మల్లారెడ్డి, ఎం.నర్సింహ్మ, రామేశ్వర్‌రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.- మైలార్‌దేవ్‌పల్లి

గిరిజనులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్

ఖైరతాబాద్, జనవరి 30 : పాలక ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్ కోరారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ 72వ సంస్థాపన దినోత్సవం గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. మాజీ ఎంపీలు సీతారాం నాయక్, రవీంద్రనాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌తో కలిసి మాట్లాడారు. దేశంలోని 15 రాష్ట్రాల్లో పది కోట్ల మంది బంజారా గిరిజనులు ఉన్నారని, ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 40లక్షల మంది ఉన్నారన్నారు. గిరిజనులను ఓట్లుగానే చూస్తున్నారని, కాని వారి సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. 500 జనాభా కలిగిన తండాలు, గూడెంలను పంచాయతీలుగా మార్చాలని, గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలన్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో గిరిజనులకు చోటు కల్పించాలని, కౌన్సిల్‌లో జరిగే ఎన్నికల్లో గిరిజనులకు జనాభా దామాషా ప్రకారం సీట్లు ఇవ్వాలన్నారు.

10 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 30: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో వచ్చే నెల 10 నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతిరోజూ ఉదయం ఆరున్నర గంటల నుంచి ఎనిమిది గంటల వరకు ప్రత్యేక బ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వచ్చే నెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 79899 03001, 98497 52655 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎంసీఏ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్) (రెండేళ్ల కోర్సు) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 19లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో గురువారం నర్సరీ మేళాను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఉంచిన పూల మొక్కలు ,వివిధ రకాల ఆకృతులు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.